క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన అంజూరు ప్రతిభాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె భర్త బాలిశెట్టి చెంచయ్య ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయ మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అంజూరు వెంకటేష్ బాబు, పోలసాని స్వర్ణమూర్తి, పోలసాని షణ్ముఖం, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్, అంజూరు భాను ప్రకాష్, బాలిశెట్టి వినీత్ సాయి, అంజూరు యశ్వంత్య, యనమల మునికృష్ణయ్య, పసుపులేటి సిద్దార్థ, పోలి శ్రీధర్, దర్వాజ చేతన్ కృష్ణ సంతోష్ పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోలాహలం.. గంగ జాతర



గంగమ్మను దర్శించుకుంటున్న నూకతోటి

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడు పేట పంచాయతీలో బుధ, గురువారం నిర్వహించిన గంగజాతర కోలాహలంగా జరిగింది. బుధవారం రాత్రి అమ్మవారిని చాకలి ఇంట రూపుదిద్ది ఊరేగింపు ప్రారంభించారు. గురు వారం ఉదయం వరకు అమ్మవారు వీధుల్లో అలరించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు.

చాముండేశ్వరి దేవికి కొత్త ఆభరణాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి గురువారం కొత్త ఆభరణాలు కొనుగోలు చేశారు. ప్రధాన పూజారి కన్నా నాగయ్య, మాచర్ల బత్తినయ్య ఆధ్వర్యంలో కంఠాభరణాలు, ముత్యాల హారాలను కొనుగోలు చేశారు. ఇకపై అమ్మవారు సరికొత్త అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఘనంగా చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం చిన్నకొట్టాయి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

మజ్జిగ పంపిణీ



వరదయ్యపాళెం: మండలంలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెం బస్టాండ్ ప్రాంగణంలో స్థానికులకు వితరణగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు. సభ్యులు కిషోర్‌కుమార్, సురేష్, గవాస్కర్, గుత్తి త్యాగరాజు, మాజీ సర్పంచ్ చిన్నా పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం

శ్రీకాళహస్తి: శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్ పరిశ్రమ భూమి పూజకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు గురువారం ఘన స్వాగతం లభించింది. పరిశ్రమ భూమి పూజ అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి ప్రయాణమైన ఆయనకు ఊరందూరు వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వాగతం పలికారు. గజమాలవేసి సత్కరించారు. అదేవిధంగా లోకేష్‌ను తిరుపతి విమానాశ్రయంలో మీసేవ యూనియన్ నాయకులు కలిశారు. లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి మంచి సేవలందించాలని సూచించారు. సచివాలయంలోని ఉన్న అన్ని సేవలు మీసేవలో అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా ప్రెసిడెంట్ సూర్యకుమార్, మీసేవ సభ్యులు కిరణ్, శ్రావణ్, తేజ, గుణ, గురవయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

రైతులకు దూరంగా సేవలు

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, విధానాలు రైతులకు ఎంతో మేలు చేకూరాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ప్రజలు, రైతులకు అందాల్సిన సేవలు అందని ద్రాక్షగా మారాయి. రైతులకు ఎంతో ఉన్నత సేవలు అందించే రైతు సేవా కేంద్రాల పరిస్థితి ప్రస్తుతం మరింత దయనీయంగా మారింది. కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు మూలకు చేరాయి. యంత్ర పరికరాలు సైతం అధికార పార్టీ వారికి, వారి సానుభూతిపరులకే అందుతుండడంతో అన్నదాతలు మండిపడుతున్నారు.

- రూ.లక్షల ప్రజాధనం వృథా
- అలంకారప్రాయంగా కియోస్క్‌లు
- కూటమి పాలనలో సీహెచ్‌సీలకు మంగళం
- రైతులందరికీ దక్కని యంత్ర పరికరాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



మరదవాడలో సిబ్బంది రాక మూతపడిన రైతుసేవా కేంద్రం

వరదయ్యపాళెం : వ్యవసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న దానికి నిదర్శనమే లక్షల రూపాయలు విలువ చేసే కియోస్క్‌లను అటకెక్కించారు. ప్రభుత్వం గద్దెనెక్కి 11 నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయని తీరు ఇందుకు సాక్ష్యం. రబీ సీజన్ ముగిసి ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నా పెట్టుబడి సాయంపై కనీసం స్పష్టత లేదని రైతులు ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామన్న హామీని సీఎం చంద్రబాబు విస్మరించారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయానికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రైతుల సౌకర్యార్థం సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో ఆర్బీకే భవనాన్ని రూ. 21 లక్షలతో నిర్మించింది. గత ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలు అందజేసేందుకు రూ.లక్షతో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. సత్యవేడు నియోజకవర్గంలో 87 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ప్రతి ఆర్బీకేలో ఆండ్రాయిడ్ పరిజ్ఞానంతో పనిచేసే కియోస్క్‌లు ఉన్నాయి. ఆర్బీకేల ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల బహుళ సేవలను కియోస్క్ డిజిటల్‌తో అనుసంధానం చేశారు. వ్యవసాయ ఉత్పాదకాలను ఆన్‌లైన్‌లో రైతులు బుక్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఆయా ప్రాంతాలలోని వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ ధరలు, పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం అందుబాటులో ఉండేది. కియోస్క్ యంత్రంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాల ను ముందుగానే నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను మూలన పడేసింది. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసినందుకే ఈ యంత్రాలను కూటమి సర్కారు అటకెక్కించిందని రైతులు నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ధనాన్ని వృథా చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సత్యవేడు నియోజకవర్గంలో రైతుసేవా కేంద్రాల వివరాలు:

మండలం	సంఖ్య
పిచ్చాటూరు :	10
నాగలాపురం :	10
నారాయణవనం :	08
వరదయ్యపాళెం :	12
సత్యవేడు :	14
కేవీబీపురం :	19
బీఎన్‌కండ్రిగ :	14

సీహెచ్‌సీలకు చరమగీతం

క్షేత్రస్థాయిలో రైతులకు ఎంతో మేలు చేసే కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)కు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. రైతులకు వ్యవసాయ యంత్రాలు, పరికరాలు ఇచ్చేందుకు డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద అనేక పరికరాలను రైతులకు అందజేసింది. ట్రాక్టర్లు, ట్రక్కులు, ఇంజిన్లు, వరికోత యంత్రాలు, యంత్ర సామాన్లను పంపిణీ చేశారు. అందుకు గ్రామాల్లో పార్టీలు, కులాలు, వర్గాలకు అతీతంగా అర్హత కలిగిన రైతులందరినీ సంఘాలుగా ఏర్పాటు చేసి (సీహెచ్‌సీలు) కస్టమ్ హైరింగ్ సెంటర్‌గా పేరు పెట్టారు. ప్రతి సంఘానికి 40శాతం సబ్సిడీపై సుమారు రూ. 15 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు పరికరాల లబ్ధిని చేకూర్చారు.



వరదయ్యపాళెం : రైతుసేవా కేంద్రంలో అలంకారప్రాయంగా కియోస్క్

ఎంతగానో ఉపయోగపడేవి



గత ప్రభుత్వంలో ఆర్బీకేలలో రైతులకు అవసరమైన అన్నిసేవలు అందేవి. ఇప్పుడు అలాంటి సేవలు, సౌకర్యాలు ఆర్బీకేలలో (రైతు సేవా కేంద్రాలలో) అందడం లేదు. కియోస్క్‌లను ఉపయోగించుకుని ఎరువులు, మందులు పంట సాగుకు ముందుగానే పొందేవాళ్లం. ఇప్పుడు ఆ అవకాశం లేదు. ప్రభుత్వం యంత్రాలను మూలకు పడేయడం ఏమాత్రం సమంజసం కాదు.

– సుధాకర్, రైతు, పెద్ద పాండూరు

అందుబాటులోకి తీసుకురావాలి



రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సేవలు ఆర్బీకేలోని కియోస్క్‌ల ద్వారా అందేవి. పల్లెల్లోని రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలు, పెద్ద పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే అందుబాటులో ఉండేవి. వ్యవసాయానికి సంబంధించిన సేవలను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కియోస్క్ యంత్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.

–మల్లికార్జున్ రెడ్డి, సత్యవేడు రైతు విభాగం అధ్యక్షుడు

కియోస్క్‌లను కొనసాగించాలి



కియోస్క్ సేవలను కొనసాగించాలి. ఎరువులు నిల్వలు, ధరలు రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. వ్యవసాయ పథకాలు సకాలంలో అందించేందుకు కియోస్క్ చక్కగా పనిచేశాయి. మండల కేంద్రాలకు వెళ్లకుండా ప్రతి సేవ గ్రామాల్లోనే అందేవి. రైతులు ఆ యంత్రాలను వినియోగించుకునే తీరును తెలుసుకున్నారు. పేద రైతులకు ఎంతగానో ఉపయోగపడే కియోస్క్ సేవలను కొనసాగించాలి.

–జగదీష్, రైతు, గూడలవారిపాళెం

ప్రజాధనం దుర్వినియోగం సరికాదు



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కార్యాలయ భవనాలు, అందులో ఉన్న యంత్రాలు సద్వినియోగం చేయాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న సర్కారుదే. అందుకు విరుద్ధంగా కూటమి వ్యవహరించడం సరికాదు. రాయితీ యంత్రాలను అర్హత కలిగిన ప్రతి రైతుకు అందజేయాలి. గత ప్రభుత్వ సంస్కరణలు యథావిధిగా కొనసాగించాలి. హామీలను అమలు చేయాలి.

–నూకతోటి రాజేష్, సమన్వయకర్త, సత్యవేడు నియోజకవర్గం

కమనీయం.. అగస్తీశ్వరుని కల్యాణం

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఉత్సవర్లకు ఆర్జిత కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి వారు అశ్వవాహనంపై సముదాయం గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు నిత్యకైంకర్యాలను, ఉత్సవర్లకు ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి సుందరంగా అలంకరించుకుని ప్రాకారంలో నిర్మిత కల్యాణ మండలంలో వేంచేశారు. అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణం నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై అగస్తీశ్వరుడు పుర వీధుల్లో విహరించారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, గౌతం గురుకళ్ పాల్గొని పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నటరాజ ఉత్సవం, సాయంత్రం రావణాశుర వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు.



అగస్వీశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలి

శ్రీకాళహస్తి: పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలని జర్నలిస్టులు కోరారు. వారు గురువారం ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంపై శ్రీకాళహస్తిలో ర్యాలీ చేశారు. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించొద్దని, అంతర్జాతీయంగా పాక్‌ను ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ పేరిట ఉగ్రవాదులను మట్టుబెట్టడం హర్షించదగ్గ పరిణామని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కార్తీక్ నాయుడు, వీఆర్వో ఈశ్వర్, సీనియర్ పాత్రికేయులు చంద్రయ్య, బాలచంద్ర, కాకి హరిబాబు, కామేష్, చంద్రశేఖర్, రఫీ, ధనశేఖర్, వెంకటేష్, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విలేకరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి: అంతర్జాతీయ రెడ్ క్రాస్ డే సందర్భంగా గురువారం తొట్టంబేడు మండలం బోనుపల్లిలో శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం ఆస్పత్రి, తిరుపతి జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మందికి పైగా వైద్య చికిత్స చేయించుకున్నారు. జిందాల్ పవర్, సింహపురి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మందులు అందజేశారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తమ ఆస్పత్రి స్థాపించినప్పటి నుంచి శ్రీకాళహస్తి, చుట్టుపక్కల గ్రామాల్లో ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామానాయుడు, తిరుపతి రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు సుబ్బారావు, డాక్టర్ ఓ సుదీర్, అజయ్ కుమార్, కృష్ణకుమార్, ఎంజీఎం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న గుడ్లూరు మయూర్

నోటీస్ బోర్డు

నేడు సర్వసభ్య సమావేశం

నాగలాపురం: పిచ్చాటూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ మహ్మద్‌రఫి తెలిపారు. జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్యం పడకేసింది



పేరుకుపోయిన చెత్త

నాగలాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వద్ద బస్‌షెల్టర్ ఎదురుగా చెత్తచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుంటున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి ఆస్పత్రి వద్ద పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీపీఎం ప్రధాన కార్యదర్శికి సాదర స్వాగతం



ఎంఏ బేబీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం న్యూఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీకి ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుపతి వెళ్లారు. కార్యక్రమంలో కందారపు మురళీ, టి.సుబ్రహ్మణ్యం, కేఎస్ఎస్ ప్రసాదరావు, హరినాథ్, ఈశ్వరి పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ హర్షనీయం



ఆర్ఎం రఫీవుల్లా

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): పాకిస్తానీ ఉగ్రవాదులను అంతం చేయడానికి ఆపరేషన్ సింధూర్ నిర్వహించడం హర్షనీయమని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ఆర్.ఎం రఫీవుల్లా తెలిపారు. ఆయన గురువారం రేణిగుంటలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ సమాజం విమర్శలు చేయడానికి వీలులేకుండా ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదుల స్థావరాలను మట్టుబెట్టడం గొప్ప విజయమన్నారు. ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషిని ఆపరేషన్‌లో భాగస్వామి చేయడం అభినందనీయమన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం వస్తే తన కుటుంబంలో ఇద్దరు కుమారులతో పాటు తాను కూడా యుద్ధానికి వెళతామని పేర్కొన్నారు.

చెన్నకేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం





శ్రీకాళహస్తి మండలం ఊరందూరు చెన్నకేశవుని ధ్వజారోహణం, ఉత్సవమూర్తుల ఊరేగింపు

రేణిగుంట/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి అంకురార్పణ చేశారు. గురువారం తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఏఈవో హేమమాలిని ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు అర్థగిరి నేతృత్వంలో పూజారులు ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. రాత్రి హంసవాహనం చేపట్టారు. శ్రీకాళహస్తి దేవస్థానం సూపరింటెండెంట్ రవి, లక్ష్మయ్య, దుర్గ, దాము తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



అభయ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి



కావమ్మ మారయ్య ఆలయంలో భూమన కరుణాకరరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని దిగువ సన్నిధి వీధిలో శ్రీకాళహస్తి బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షులు సింగరాజు ప్రకాశం శాస్త్రి, శ్రీహనుమాన్ సేవా సమితి అధ్యక్షులు దర్బా తులసిరామ్ శర్మ, మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్మించిన సంకటహర అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. టీటీడీ మాజీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సంకటహర అభయ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా బహదూరుపేటలోని కుమ్మరివీధిలో నిర్మించిన కావమ్మ, మారయ్య ఆలయంలోనూ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకానికి హాజరై పూజలు చేశారు. వారికి ఆలయ ధర్మకర్త బాలకృష్ణస్వామి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, నియోజవర్గ యువత అధ్యక్షుడు శ్రీవారి సురేష్, మాజీ కౌన్సిలర్ కంటా ఉదయ్ కుమార్, ఫతాన్ ఫరీద్, ధన, వేలూరు రమేష్, ముని కుమార్ పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీలో తెగని పంచాయితీ

- మంత్రి లోకేష్ పర్యటనలోనూ తేలని ఇన్‌చార్జ్ పదవి
- ఎమ్మెల్యేపై సస్పెన్షన్ కొనసాగింపునకే మొగ్గు
- నిరసనలు, కలయికలతో ముగిసిన మంత్రి పర్యటన

వరదయ్యపాళెం: సత్యవేడు టీడీపీలో రాజకీయ అనిశ్చితకే ఆ పార్టీ అధినాయకత్వం మొగ్గు చూపుతోంది. సాక్షాత్తు మంత్రి లోకేష్ రెండు రోజులపాటు నియోజకవర్గంలో మకాం పెట్టినప్పటికీ నియోజకవర్గ పంచాయితీని మాత్రం తేల్చలేదు. అటు సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై ఉన్న సస్పెన్షన్ వేటును కొనసాగింపునకే పార్టీ అధిష్టానం కట్టుబడినట్లు తెలుస్తోంది. అందుకు సాక్ష్యం గత మూడు రోజులుగా జరిగిన పరిణామాలే నిదర్శనం. మంత్రి నియోజకవర్గ పర్యటనకు సిట్టింగ్ ఎమ్మెల్యేను దూరం పెట్టడమే. మంత్రి పర్యటన సమయంలో ఎమ్మెల్యే వర్గీయులు ప్లకార్డులతో నిరసన తెలిపినప్పటికీ వారి బాధను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. షెడ్యూల్ ప్రకారం ముందుగా నిర్ణయించిన మేరకు రెండు రోజుల పాటు మంత్రి లోకేష్ పర్యటనను ముగించేశారుగానీ నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న రాజకీయ అనిశ్చితకు మాత్రం పరిష్కార మార్గం చూపలేదని స్వయాన ఆ పార్టీ నాయకులే నియోజకవర్గ వ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా అటు నిరసనలు, ఇటు కలయికలతో మంత్రి పర్యటనను ముగింపజేశారు.



సత్యవేడులో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్

ఆ ఇద్దరితో పార్టీ కమిటీలు కొనసాగింపు జరిగేనా?:

నియోజకవర్గంలో పార్టీ పరిశీలకులుగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు, కో–ఆర్డినేటర్‌గా ఉన్న శ్రీపతిబాబులతో త్వరలో ఏర్పాటు చేయనున్న కమిటీలను పూర్తి చేస్తామని పార్టీ శ్రేణుల ముఖాముఖి సదస్సులో మంత్రి లోకేష్ వెల్లడించినట్లు సమాచారం. అయితే నియోజకవర్గంలోని 7 మండలాల్లో అటు సిట్టింగ్ ఎమ్మెల్యేతో ఓ వర్గం, ఇటు పరిశీలకునితో మరో వర్గం, పక్క నియోజకవర్గంలోని వ్యాపారవేత్తతో మరికొందరు ముఖ్య నాయకులు ఉన్నారు. ఇలా మూడు ముక్కలాటగా ఉన్న సత్యవేడు టీడీపీలో నాయకులను ఏకతాటిపైకి తెచ్చి కమిటీలను పూర్తి చేయడం పరిశీలకునికి, కో–ఆర్డినేటర్‌కు కత్తి మీద సాము లాంటిది. మంత్రి వారికి బాధ్యతలను అప్పగించినప్పటికీ నియోజకవర్గ శ్రేణులు ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడక తప్పదు.

నియోజకవర్గ అభివృద్ధి ఊసెత్తని మంత్రి:

రెండు రోజుల పాటు సత్యవేడులో మంత్రి లోకేష్ పర్యటించారు. అయితే ఎక్కడా గానీ నియోజకవర్గ అభివృద్ధి గురించి ప్రస్తావించలేదు. నియోజకవర్గ అభివృద్ధికి వరాలు ఇస్తారని ఎదురు చూసిన వారి ఆశలు నిరాశగా మిగిలాయి. కేవలం వారు ఎంపిక చేసుకున్న పార్టీ శ్రేణులు కొందరికి మాత్రమే సెల్ఫీలతో ఉత్తమ నాయకులుగా ప్రశంసాపత్రాల అందజేతతో చిన్నబాబు పర్యటన ముగిసింది. నియోజకవర్గంలో ఎన్నో సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. అందులో ఏ ఒక్క సమస్యనైనా మంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషిచేయాలన్న ఆలోచన ఆ పార్టీ ముఖ్య నాయకులకు రాకపోవడం గమనార్హం. దీనిపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

కూటమి నేతలకు దక్కని మంత్రి దర్శనం:

కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ, జనసేన నాయకులకు మంత్రి లోకేష్ పర్యటన గురించి కనీస సమాచారం ఇవ్వలేదని ఆ పార్టీ నాయకులు లోలోన రగిలిపోతున్నారు. ఆహ్వానం లేనప్పటికీ మనస్సు చంపుకుని కార్యక్రమం వద్దకు వెళ్లిన వారిని లోనికి అనుమతించలేదని వాపోతున్నారు. పూర్తిగా మంత్రి ముఖాముఖిలో పాల్గొన్న మేజారిటీ నాయకులు గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి వెన్నుపోటు పొడిచి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగిన చెరకు గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థి నుంచి భారీగా ముడుపులు అందుకున్న వారేనని టీడీపీలోని కొందరి నేతలు ఆరోపించడం గమనార్హం.